క్లుప్తంగా

సజ్జలను కలిసిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు



సజ్జలతో ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: స్థానిక ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు గురువారం ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ అభివృద్ధి విషయాల గురించి సజ్జలతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా ఆయన వెంట పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాలకు నిరంతర విద్యుత్



విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

త్రిపురాంతకం: ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలు, వ్యవసాయ కనెక్షన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఎస్ఈ సత్యనారాయణ విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం త్రిపురాంతకంలో విద్యుత్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించలని వినియోగదారులకు సూచించారు. ఆయన వెంట డీఈఈ శివనాగేశ్వరరావు, ఏఈ చిన్న మంగారావు, ఎల్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మార్కాపురంలో వడగళ్ల వాన



రాయవరం బ్రిడ్జి వద్ద విరిగి పడిన చెట్టు

మార్కాపురం: మార్కాపురం, తర్లుపాడు మండలాల్లో గురువారం సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి తీవ్రమైన గాలి దుమారంతో పాటు ఉరుములు, మెరుపులతో వడగల్ల వాన కురిసింది. గంట పాటు కురిసిన వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పలు చోట్ల పిడుగులు పడినా ఎటువంటి నష్టం సంభవించలేదు. పట్టణంలో, రూరల్‌లో పలు ప్రాంతాల్లో వీధులు జలమయం కాగా చెట్లు విరిగి పడ్డాయి. తీవ్రమైన వేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించగా పొలాల్లో మిర్చి ఆరబోసుకున్న రైతులు ఇబ్బందులు పడ్డారు.

జూదరుల అరెస్టు

రాచర్ల: పోలీసులు దాడులు నిర్వహించి మండలంలోని గంగంపల్లె గ్రామ సమీపంలో గంగమ్మ చెరువులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.25,240 స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు వద్ద ఈ నెల పదో తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడిన షేక్ బాజీ సుభానీ (20) ఒంగోలులోని ఓ ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన బాజీ సుభానీ ఎంబీఏ పూర్తి చేసి ముండ్లమూరు మండలంలో అమూల్ పాలకేంద్రంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల పదో తేదీన దర్శి–అద్దంకి ప్రధాన రహదారి వేంపాడు వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని క్రాస్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనం తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయాలు కావడంతో ఒంగోలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు మట్టిపాటి హసన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసినట్లు ఎస్ఐసంపత్‌కుమార్‌తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

మార్కాపురం టౌన్: రైలు కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి మార్కాపురం, తర్లుపాడు రైల్వేస్టేషన్ల మధ్య జరిగినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మర్రి క్రిష్ణ తెలిపారు. మృతుని వయసు 45 ఏళ్లు ఉంటుందని, అనుమానితులు ఎవరైనా తప్పిపోయి ఉంటే తమను సంప్రదించాలని ఆయన కోరారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఆత్మహత్య, ప్రమాదమా అన్న విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని తెలిపారు.



మార్కాపురంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న జంకె వెంకటరెడ్డి

మహనీయుడు పొట్టి శ్రీరాములు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు మహనీయుడని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం మార్కాపురంలోని జవహర్ నగర్‌లో ఉన్న తన నివాసంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసి మహనీయుడన్నారు. ఆయన పోరాటం భావి తరాలకు ఆదర్శమన్నారు. మున్సిపల్ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి పోరాటాన్ని, ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సీహెచ్ బాల మురళీకృష్ణ అన్నారు. ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి సూర్య సుబ్బారావు, కోశాధికారి రామడుగు రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జీఎల్ రమేష్‌బాబు, దండా వెంకటరెడ్డి, అంజనేయులు, విజయకుమార్, భారతి, వేణుగోపాల్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరు: ఆంధ్ర రాష్ట్రం సాధన కోసం ఆమర నిరహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు తాళ్లూరు మండల ప్రజాప్రతినిధులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి, వైద్యశాల వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డిలు మాట్లాడారు. పొట్టి శ్రీరాములు సేవలను ఎంఈఓ జి.సుబ్బయ్య కొనియాడారు. తాళ్లూరు, మల్కాపురం సర్పంచిలు మేకల చార్లెస్ సర్జన్, వలి, కో ఆప్షన్‌మెంబర్ కరిముల్లా, ఎస్ఓ వజ్జా శ్రీనివాసరావు, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్ శనివారపు శ్రీనివాసరెడ్డి, కోటయ్య పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తాళ్లూరు పీహెచ్‌సీ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. సంఘ బాధ్యుడు రవి, శ్రీను, కోటేశ్వరరావు, రిటైర్డు హెచ్ఎం అంజిరెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ మాగుటూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మెయిన్ బజారులోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 188 మంది విద్యార్థినులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు కృషి చేశారని కొనియాడారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 1952 అక్టోబర్ 19న బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారన్నారు. ఆయన కృషి వల్లే మనకు ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగిందని గుర్తు చేశారు. ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్, ఎంఈఓ ఎస్.సాంబశివరావు మాట్లాడిన వారిలో ఉన్నారు. సర్పంచ్ రాచగొర్ల మహేష్, ఈఓఆర్డీ ఎస్.డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారిపేట: స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరణ దీక్ష చేపట్టిన మహనీయుడని, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారని, నెల్లూరులో దళితుల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేపట్టినట్లు పలువురు వక్తలు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ సుబ్బారావు, మండల కార్యదర్శి కేసీహెచ్ వెంకట్రామయ్య, రిటైర్డ్ ఎంఈఓ సీహెచ్ మాధవకృష్ణారావు పాల్గొన్నారు.

ముండ్లమూరు: అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆర్యవైశ్య సంఘం, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు గురువారం ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రమైన ముండ్లమూరు ఆర్యవైశ్య సంఘ నేతలు పులికొండ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలెపోగు డగ్లస్, ఎస్ఐ సంపత్‌కుమార్‌లు నివాళులర్పించారు. కెల్లంపల్లి, ముండ్లమూరు పాఠశాలలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

యర్రగొండపాలెం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని వైపాలెం నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వైపాలెం బస్టాండ్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని విద్యార్థులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.ప్రదీప్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాసచార్యులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

పెద్దారవీడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దొండపాటి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: స్థానిక శాఖా గ్రంథాలయలంలో లైబ్రేరియన్ వై.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు పోరాట పటిమను విద్యార్థులకు వివరించారు.

పొదిలి: రాష్ట్రావతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని కళాశాల కమిటీ అధ్యక్షుడు జీసీ సుబ్బారావు అన్నారు. గురువారం స్థానిక ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలలో శ్రీరాముల జయంతి వేడుకలు జరిగాయి. శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రామకోటయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకం: స్థానిక వాసవీమాత ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య సంఘ నాయకుల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం శ్రమించిన పొట్టిశ్రీరాములు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చీతిరాల హనుమంతరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గుండా చిన్న సుబ్బారావు, యువజన సంఘ అధ్యక్షుడు కాసుల ప్రసాద్, కె.పూర్ణ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెద్దారవీడులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి



తాళ్లూరులో..



బేస్తవారిపేటలో..



పరీక్ష అట్టలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



త్రిపురాంతకంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్యవైశ్యుల నివాళి

కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



పోలీసులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శ్రీధర్‌రావు

- జిల్లా అదనపు ఎస్పీ శ్రీధర్‌రావు

మార్కాపురం టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపియింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ శ్రీధరరావు హెచ్చరించారు. గురువారం ఆయన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. చివరి పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్ష కేంద్రాల వద్ద కాపీయింగ్‌కు ఎలాంటి అవకాశం లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష రాసే విద్యార్థులు, సిబ్బందిని తప్ప బయట వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు. పరీక్ష కేంద్రం బయటే విద్యార్థులను చెక్ చేసి పంపాలని చెప్పారు. ఇంకా పలు సూచనలు చేశారు. ఆయన వెంట పట్టణ ఎస్ఐ శశికుమార్ ఉన్నారు.

ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం

కంభం: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 5 పరీక్ష కేంద్రాలు ఉండగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 347 మంది విద్యార్థులను కేటాయించగా 293 మంది హాజరై 54 మంది గైర్హాజరయ్యారు. తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 255 మందికి 251 హాజరు, నలుగురు గైర్హాజరయ్యారు. గౌతమి జూనియర్ కళాశాలలో 297 మందికి 277 మంది హాజరై 20 మంది గైర్హాజరయ్యారు. సీఎల్ఆర్ కళాశాలలో 378 మందికి 364 హాజరై 14 మంది గైర్హాజరయ్యారు. వాసవీ జూనియర్ కళాశాలలో 299 మందికి 14 మంది గైర్హాజరయ్యారు.

ప్రకృతి వ్యవసాయ సాగుపై శిక్షణ



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

దర్శి: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయ సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. రైతులకు ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తే విచక్షణారహితంగా ఉపయోగించే రసాయన మందులు నియంత్రించవచ్చని, తద్వారా పర్యావరణ సమతుల్యాన్ని, భూమి యొక్క ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. రసాయన ఎరువులకు బదులు రైతులు పశువుల ఎరువురులు, పచ్చిరొట్ట ఎరువులు, వానపాముల ఎరువులు విరివిగా ఉపయోగించటం ద్వారా భూమిలో కర్బనం శాతాన్ని పెంచుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతుల అవగాహన స్థాయిని అంచనా వేసేందుకు ప్రీ ఎవల్యూషన్ పరీక్ష నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సాగుకు జిల్లాకు అనుకూలమైన వివిధ పంటల్లో వంగడాలు రైతులకు శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేసేటప్పుడు పంటల్లో వచ్చే చీడపీడలు వాటి యాజమాన్య పద్ధతులను డాక్టర్ జాహ్నవి వివరించారు. ఉద్యాన పంటలను ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏ విధంగా సాగు చేయవచ్చునో ఆ విధంగా సాగు సమయంలో పంటల్లో వచ్చే తెగుళ్ల వాటి యాజమాన్య పద్ధతుల గురించి డాక్టర్ ఎం.శివ వివరించారు. భాగంగా రైతులకు రాజంపల్లిలో జీ శ్రీమన్నారాయణ, ప్రకృతి వ్యవసాయదారుడు చేపట్టిన క్షేత్రాలను రైతులకు విజ్ఞాన యాత్ర నిర్వహించారు. రైతులు, కేవీకే శాస్త్రవేత్తలు, రిలయన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటీన్స్ ఉండే ఆహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఆరతిభూషణ్

బేస్తవారిపేట: దంతాలు బలంగా దంతక్షయం రాకుండా ఉండాలంటే ప్రొటీన్స్ ఉండే ఆహారం తీసుకోవాలని డెంటల్ డాక్టర్ ఆరతిభూషణ్ అన్నారు. గురువారం మండలంలోని పూసలపాడు జెడ్పీ హైస్కూల్లో ఓరల్ హెల్త్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిశీతల, అతివేడి పదార్థాలు తీసుకోవద్దన్నారు. పొగాకు, ధూమపానం, గుట్కా వంటి చెడు అలవాట్లు మానుకోవాలని, ఇవి తీసుకుంటే నోటి క్యాన్సర్ వస్తుందని హెచ్చరించారు. ఆహారం తిన్న తర్వాత నోటిని పుక్కిలించాలన్నారు. ఏడాదిలో రెండు సార్లు తప్పనిసరిగా దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. 40 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. హెల్త్‌ద్యుకేటర్ ఎంవీ విజయభాస్కర్, హెచ్ఎం రూతుమెర్సీ జాయ్, ఎస్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక యాప్‌తో కూలీల హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ కొండయ్య

ముండ్లమూరు: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను ఇకపై టెలిగ్రామ్ యాప్ ద్వారా నమోదు చేయాలని ఏపీఓ చినకొండయ్య సూచించారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో సిబ్బందితో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న పనులను ప్రతి రోజూ నూతన సాంకేతిక సహాయంతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఉదయం 10 గంటల్లోపు పని ప్రదేశాన్ని టెలిగ్రామ్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. మస్టర్లలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సాంకేతిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూలీలకు కొలతలు నిర్దేశించి పనులు చేపిస్తేనే గిట్టుబాటు కూలి వస్తుందన్నారు. సమావేశంలో సాంకేతిక సహాయకులు అశోక్, మాలకొండారెడ్డి, నాగరాజు, సుధాకర్, షాలెం, రూతమ్మ పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ

కొమరోలు: శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ సూచించారు. మండలంలోని తాటిచెర్లమోటులో నిర్వహిస్తున్న శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శనగల కొనుగోలుకు సంబంధించిన సూచనలు సంబంధిత అధికారులకు ఇచ్చారు. శనగల కొనుగోలు కేంద్రంలో రైతులు శనగల శ్యాంపిల్స్ అందచేసి వాటి టోకెన్లు తీసుకోవాలని సూచించారు. దళారుల వద్ద శనగలు అమ్మి రైతులు నష్టపోవద్దని, ప్రభుత్వ మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. వీరి వెంట గిద్దలూరు ఏడీఏ బాలాజీ నాయక్, వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- భక్తులతో పులకించిన వెలుగొండ
- గోవింద నామస్మరణతో పరవశించిన భక్తులు

కొనకనమిట్ల: నమో వేంకటేశాయా.. గోవిందా.. గోవిందా అంటూ భక్తులు పరవశించిపోయారు. శ్రీవారి బ్రహ్మోత్సవం వేళ గురువారం ప్రధాన తిరునాళ్ల కావడంతో వెలుగొండ క్షేత్రం భక్తులతో పులకించింది. గోవిందనామ స్మరణతో వెలుగొండ ప్రాంతం మార్మోగింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. తిరునాళ్ల కావడంతో వెలుగొండలో భక్తులతో బ్రహ్మోత్సవ సందడి నెలకొంది. క్యూలైన్లో భారీ సంఖ్యలో వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులు తలనీలాలు సమర్పించగా మహిళలు నైవేద్యాలతో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. కొండపైకి అమ్మవారికి, గంగాభవానీ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారు పల్లకిలో అలంకరించిన గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారిని వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ పురవీధుల్లో గజోత్సవం నిర్వహించారు. ఉభయదాతలు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగాయి. వేదపండితులు ప్రసాదాచార్యులు, పవనకుమారశర్మ స్వామివారికి అర్చనలు అభిషేకాలు చేశారు. శుక్రవారం రథోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు. తిరనాళ్ల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పొదిలి సీఐ సుధాకరరావు పర్యవేక్షణలో ఎస్ఐ దీపిక పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు



ఉత్సవంలో ఉభయదాతలు



స్వామి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్ష పత్రాల లీక్

కొమరోలు: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 9వ తేదీ నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్ష ముందు రోజు యూట్యూబ్‌లో ప్రశ్నపత్రాలు చక్కర్లు కొడుతున్నాయి. తెలుగు సబ్జెక్టు నుంచి సైన్స్ సబ్జెక్టు వరకు ముందు రోజే ప్రశ్నపత్రం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుండటంతో విద్యార్థులు ఆ ప్రశ్నపత్రాలనే చదువుకుని వచ్చి పరీక్షలు రాస్తున్నారు. దీంతో తెలివి కలిగిన విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. ఈ వ్యవహారంపై ఎంఈఓను వివరణ కోరగా తమ వద్ద ఎటువంటి అవకతవకలు జరగడం లేదని, అసలు ఈ విషయం తమ దృష్టికి రాలేదని చెబుతున్నారు.

వర్మీ కంపోస్టు యూనిట్లతో ప్రయోజనం

పుల్లలచెరువు: మండలంలోని ప్రతి పంచాయతీలో వర్మీ కంపోస్టు యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈఓఆర్డీ బాలునాయక్ సూచించారు. గురువారం కొమరోలు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీకి అవసరమైన వానపాములు వేసినట్లు ఈఓఆర్డీ తెలిపారు. యండ్రపల్లి, కోమరోలు, రాచకొండలో యూనిట్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటి వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరడంతోపాటు రైతులకు కూడ ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శివ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 20 కుటుంబాలు



కృష్ణమోహన్‌రెడ్డితో ఏరువ రామిరెడ్డి

మార్కాపురం: పట్టణానికి చెందిన ప్రముఖ బిల్డర్ ఎరువ రామిరెడ్డి గురువారం రాత్రి తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు, మాజీ వైస్ ఎంపీపీ కుందురు కృష్ణమోహన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో వారికి మంచి స్థానం కల్పిస్తామని, కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. తన సోదరుడు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని, పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. రామిరెడ్డితో పాటు 20 కుటుంబాల వారు పార్టీలో చేరటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు నగేష్, కె.కృష్ణ, ఉత్తమకుమార్, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, నాగేంద్రరెడ్డి, కుందూరు హనుమంతారెడ్డి, డీవీఆర్, టైలర్స్ సంఘ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, గుంటక చెన్నారెడ్డి పాల్గొన్నారు.